# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ చట్ట సభలు మరింత సమర్ధంగా పని చేయాలని పాట్నాలో జరిగిన 85వ అఖిల భారత స్పీకర్ల సదస్సు నిర్ణయించిందని లోక్ సభ సభాపతి ఓం బిర్లా తెలిపారు.

- ❖ గత 10 సంవత్సరాలలో దేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 800 కోట్ల డాలర్లకు పెరిగిందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.

- ❖ భారతదేశం ప్రపంచ ఆహార కేంద్రంగా మారుతుందని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

- ❖ సుకన్య సమృద్ధి యోజన పథకం కింద 4 కోట్లకు పైగా ఖాతాలు ప్రారంభించామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

- ❖ జేఈఈ మెయిన్స్ - 2025 మొదటి సెషన్ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి.

==================================

చట్ట సభలు మరింత సమర్ధవంతంగా పని చేయాలని పాట్నాలో జరిగిన 85వ అఖిల భారత స్పీకర్ల సదస్సు నిర్ణయించిందని లోక్ సభ స్పీకర్ సదస్సు ఎక్స్ అఫిషియో చైర్మన్ అయిన ఓం బిర్లా తెలిపారు. సదస్సు గురించి ఆయన పాత్రికేయులతో ఈ రోజు మాట్లాడుతూ... 5 తీర్మానాలను ఈ సందర్భంగా ఆమోదించామని వెల్లడించారు. రాజ్యాంగం విలువలను మరింత పెంచేలా చట్ట సభల నిర్వహణ ఉండాలని కూడా తీర్మానించామని అన్నారు. సభా నిర్వహణలో ఆటంకాలు లేకుండా చూడాలని, అర్ధవంతమైన చర్చలకు అవకాశం ఉండేలా చర్యలు తీసుకోవాలని సదస్సు నిర్ణయించిందని చెప్పారు. మెరుగైన సేవలందించడం కోసం సాంకేతిక సహకారాన్ని కృత్రిమ మేధ (AI)ని కూడా స్వీకరించాలని సదస్సు నిర్ణయించిందని ఓం బిర్లా వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

కాగా, ఈ రెండు రోజుల సదస్సుకు దేశంలోని 23 శాసన సభలకు చెందిన 41 మంది స్పీకర్లు హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత 10 సంవత్సరాల కాలంలో దేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 800 కోట్ల డాలర్లకు పెరిగిందని సైన్స్ & టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఇది వచ్చే దశాబ్దంలో 4 వేల 400 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. కేంద్ర మంత్రి ఈ రోజు ఒక టీవీ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... 2027లో స్వదేశీ గగన్‌యాన్ మిషన్, 2028లో చంద్రయాన్-4 మిషన్, 2030లో శుక్రయాన్ మిషన్ వంటివి భారత అంతరిక్ష కేంద్రం ప్రతిష్టాత్మక ప్రాజెక్టులని అభివర్ణించారు. అంతరిక్ష ఆవిష్కరణలకు అంకుర సంస్థల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగినంత ప్రోత్సాహం అందిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం ప్రపంచ ఆహార కేంద్రంగా మారుతుందని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ విశ్వాసం వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో ఆయన నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరితో కలిసి “ఇండియా పెవిలియన్”ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ... భారతదేశ పురోగతి యావత్ ప్రపంచానికి మేలు చేస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం ఆహార కేంద్రం కావాలన్నదే నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆకాంక్ష అని అన్నారు. ఆహార శుద్ధి రంగాన్ని బలోపేతం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా సుకన్య సమృద్ధి ఖాతాలు ఇప్పటిదాకా ప్రారంభించామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. బేటీ బచావో.. బేటీ పఢావో.. ప్రచారంలో భాగంగా ఈ పథకం 2015 జనవరి 22న ప్రారంభించబడింది. ఈ పథకం ద్వారా తల్లిదండ్రులు బాలికల కోసం సుకన్య సమృద్ధి ఖాతాను ఏదైనా పోస్ట్ ఆఫీస్ లేదా వాణిజ్య బ్యాంకు బ్రాంచ్‌లో తెరవడానికి అనుమతిస్తుంది. ఇది కనీస ప్రారంభ డిపాజిట్ 250 రూపాయలతో ప్రారంభమవుతుంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం, ఈ పథకం ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి 8.2 శాతం వడ్డీ రేటును అందిస్తోంది. ఈ సంవత్సరం, జనవరి 22వ తేదీకి సుకన్య సమృద్ధి యోజన 10 సంవత్సరాలను పూర్తి చేసుకుంటుంది. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటిలో కుమార్తెల ఉజ్వల భవిష్యత్తు కోసం పెట్టుబడి పెట్టడానికి ఆయా కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జేఈఈ మెయిన్స్ - 2025 మొదటి సెషన్ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టీ ఎ) అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఐఐటీలతో పాటు పలు ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశం కోసం జేఈఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నెల 22, 23, 24, 28, 29, 30వ తేదీలలో మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. కాగా, పరీక్ష రాసే విద్యార్థులు అధికారిక వెబ్ సైట్ నుంచి అడ్మిట్ కార్డు డౌన్ లోడ్ చేసుకోవచ్చునని ఎన్.టీ.ఎ. పేర్కొంది. పరీక్షల హాలులోకి విద్యార్థులు కచ్చితంగా అడ్మిట్ కార్డును తీసుకెళ్లాలని సూచించింది. దివ్యాంగులైన విద్యార్థులు తమ వెంట మెడికల్ సర్టిఫికెట్లు వుంచుకోవాలని పేర్కొంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఒడిషా కోణార్క్‌లోని సూర్య దేవాలయంలో నిర్వహిస్తున్న జిల్లా మినరల్ ఫౌండేషన్ ప్రదర్శనను ఈ రోజు సందర్శించారు. ఒడిశా ప్రభుత్వ సహకారంతో గనుల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఈ

ప్రదర్శన ఈ నెల 18న ప్రారంభమై ఈ రోజు వరకూ సాగింది. పర్యావరణ అనుకూలమైన విధానాలను గనుల తవ్వకాలలో అనుసరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కాగా, మంత్రి తన పర్యటనలో భాగంగా స్థానికంగా ఉన్న వివిధ స్వయం సహాయక బృందాల సభ్యులతో సమావేశమయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్ - ఒడిశా సరిహద్దులో అంతర్ రాష్ట్ర సంయుక్త ఆపరేషన్‌లో కనీసం 18 మంది మావోయిస్టులు మరణించారని నక్సల్ ఆపరేషన్స్  ఛత్తీస్‌గఢ్ అదనపు డైరెక్టర్ జనరల్ వివేకానంద్ సిన్హా తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో నక్సలైట్ల కేంద్ర కమిటీ సభ్యుడు జైరామ్ అలియాస్ చలపతి కూడా మరణించాడని పేర్కొన్నారు. ఇప్పటికే చలపతి మీద కోటి రూపాయల రివార్డు ఉందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లా, ఒడిశాలోని నువాపాడా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఈ ఆపరేషన్ నిర్వహించారని వివేకానంద్ సిన్హా తెలిపారు. దాదాపు 36 గంటలకు పైగా భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య అడపాదడపా కాల్పులు జరిగాయని వివరించారు. కాగా, మావోయిస్టులు లేని భారతదేశం లక్ష్యంగా  ఇది కీలక అడుగు అని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. భద్రతాబలగాలకు ఇదొక గొప్ప విజయమని అన్నారు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని కేంద్ర హోం చెప్పారు. ఒడిశా, ఛత్తీస్ గఢ్ కు చెందిన బలగాలు, సీఆర్పీఎఫ్ ఈ ఆపరేషన్ లో పాల్గొన్నాయని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ అంటే 8 రోజుల వ్యవధిలో దాదాపు 9 కోట్ల మంది త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారని పేర్కొన్నాయి. కాగా, మహా కుంభమేళాలో అత్యంత కీలకమైన మౌనీ అమావాస్య ఈ నెల 29న రానుంది. ఆ రోజు ఏకంగా 10 కోట్ల మంది దాకా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఆదేశించారు. దీనికి ఇప్పటికే సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మహా కుంభమేళా ఫిబ్రవరి 26న మహాశివరాత్రి రోజుతో ముగుస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యానవనం ఫిబ్రవరి 2 నుంచి మార్చి 30వ తేదీ వరకు ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ప్రజలు సోమవారం మినహా వారానికి 6 రోజులు ఉదయం 10 నుండి సాయంత్రం 6 గంటల వరకు అమృత్ ఉద్యానవనాన్ని సందర్శించవచ్చునని పేర్కొన్నాయి. అమృత్ ఉద్యానవనంలో ప్రవేశం ఉచితమని, ఈ ప్రవేశం కోసం రాష్ట్రపతి భవన్ వెబ్‌సైట్ ను సంప్రదించవచ్చని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన డొనాల్డ్ ట్రంప్ కి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. భారత్- అమెరికా దేశాల మధ్య ప్రయోజనాల కోసం, ప్రపంచానికి మంచి భవిష్యత్తు కోసం మరోసారి ట్రంప్ తో  కలిసి పని చేయడానికి ఎదురు చూస్తున్నానని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా ఆయన పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా ట్రంప్ ప్రమాణ  కార్యక్రమానికి పలు దేశాలకు చెందిన నాయకులు, ప్రముఖులు హాజరయ్యారు. భారతదేశం  తరపున విదేశాంగమంత్రి జైశంకర్ ప్రమాణస్వీకార వేడుకకు హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల అండర్-19 టీ20 ప్రపంచ కప్‌లో భారత్ ఈరోజు మలేసియాతో జరిగిన మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. తొలుత భారత బౌలర్లు మలేసియాను.. 14.3 ఓవర్లలో 31 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 2.5 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా ఛేదించింది.

==================================

==================================